నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | మార్చి 03, 2025 | www.navatelangana.com

## 5 నుంచి తపాల శాఖ కార్యాలయంలో ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని తపాలా శాఖ కార్యాలయంలో ఈనెల 5వ తేదీ నుంచి ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్టు జిల్లా తపాల శాఖ సబ్ డివిజన్ అధికారి సుజిత్ ఆదేశానుసారం తపాల శాఖ నిర్వాహకులు సూర్య తెలిపారు. మండల కేంద్రంలోని తపాలా శాఖ కార్యాలయంలో ఈనెల 5 నుంచి 12 తేదీ వరకు ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభించనున్నట్టు వివరించారు. ఆధార్ నమోదుతో పాటు ఆధార్‌లో సవరణ, పుట్టిన తేదీ, వయసు మార్పు, అడ్రస్, మొబైల్ నెంబర్, ఈమెయిల్, బయోమెట్రిక్, ఫోటో, వేలిముద్రలు, కనుపాపలు సరిచేసుకోవచ్చునని సూచించారు. సంబంధిత ఒరిజినల్ పత్రాలు తీసుకొని వచ్చి మార్పు చేసుకోవచ్చునని అన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని ఆయా గ్రామాలకు సంబంధించినటువంటి ప్రజలు, విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

## వట్టిపోతున్న బోర్లు.. ఎండుతున్న వరి పంటలు

- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో యాసంగి వరి పంటలు ఎండిపోతున్నాయి. ప్రస్తుతం వేసవి కాలంలో భూగర్భ జలాలు అడుగంటడంతో బోరు బావుల్లోంచి నీరు రావడం లేదు. దీంతో పంట నష్టపోయే ప్రమాదముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వరంగల్‌లోని మామునూర్‌లో విమానాశ్రయ ఏర్పాటుకు శుక్రవారం పౌర విమానయాన శాఖ ఉత్తర్వులు జారీ చేయగా.. జిల్లాలోని జక్రాన్‌పల్లి విమానాశ్రయం అంశం చర్చకు వస్తోంది. ఉత్తర తెలంగాణలో కీలకమైన వ్యవసాయ రంగంలో ముందున్న జక్రాన్‌పల్లి చుట్టుపక్కల గ్రామాల భూముల్లో విమానాశ్రయం ఏర్పాటు కోసం డిమాండ్లు ఎప్పటినుంచో ఉన్నాయి. తెలంగాణ ఆవిర్భావానికి ముందు.. ఆ తర్వాత రాష్ట్ర రాజకీయాలలో ఉమ్మడి జిల్లాలకు చెందిన నాయకులు కీలక పదవుల్లో ఉన్నప్పటికీ విమానాశ్రయ ఏర్పాటు కలగానే మిగిలింది. జిల్లాలోని జక్రాన్‌పల్లి వద్ద గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి గతంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయినా కొలిక్కి రాలేదు.

# విమానం ఎగిరేనా..?

- వరంగల్ ఎయిర్‌పోర్టు లైన్ క్లియర్‌తో చిగురిస్తున్న ఆశలు
- గతంలో ఉమ్మడి జిల్లా నాయకులు కీలక పదవుల్లో ఉన్నా నిరాశే..
- జక్రాన్‌పల్లి వద్ద భూమి కేటాయించినా కొలిక్కి రాని వైనం

నవతెలంగాణ-ఆర్మూర్

2004లో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జిల్లాలోని రూరల్ నియోజకవర్గంలోని జక్రాన్‌పల్లి మండలం 44వ జాతీయ రహదారికి ఆనుకుని ఉందనే ఉద్దేశంతో ఇక్కడ ఏర్పాటు చేసేందుకు నాయకులకు హామీని ఇచ్చారు. ఈ ప్రతిపాదన నాటి నుంచి నేటి వరకు అలానే ఉంది. విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమున్న, అనువైన స్థలం కోసం ఇక్కడ భూములు ఉన్నాయని అప్పటి కలెక్టర్ రామాంజనేయులుకు మండల రెవెన్యూ అధికారులు నివేదికలను అందజేశారు. ఈ ప్రతిపాదనలను కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి పంపగా, ఆనాడు పలు విమానయాన సంస్థలు 2007లో ఈ భూములను పరిశీలించారు. దీనిలో మొత్తం 2003 ఎకరాల 62 గుంటల భూమిని సేకరించారు. దీనిలో 775.36 ఎకరాల పట్టా భూములు, 1208.26 ఎకరాల ప్రభుత్వ అసైన్మెంట్ భూములు ఉన్నట్లు గుర్తించారు. 2007లో ప్రత్యేక అధికారి భగవాన్‌దాస్, 2008లో ఇన్‌క్యాప్ మేనేజర్ గురుమూర్తి విమానాశ్రయ స్థలాన్ని పరిశీలించారు. వీరితో పాటు పౌర విమానయాన శాఖ అధికారులు, భూగర్భ ఘనుల, ఇతర శాఖలకు చెందిన అధికారులు ఈ భూముల వద్దకు వెళ్లి పరిశీలించారు. 2007లో రక్షణ శాఖ అభ్యంతరాలు చెప్పడంతో ఆ ప్రతిపాదన నిలిచిపోయినట్లు పుకార్లు లేచాయి. 2013 ఏప్రిల్‌లో డిలైట్ సంస్థ కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2013 మే 5న ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదన ప్రతిపాదిత స్థలాన్ని ఏయిర్‌పోర్ట్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డిపి సింగ్, డీజీఎం ఆర్‌డి, జీఎం ఏర్ ట్రాఫిక్, జాయింట్ డిఎండి ఇతర అధికారులు భూములను పరిశీలించి ఆ నివేదికను ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులకు నివేదికలను అందజేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చినప్పుడు విమానాశ్రయం ఏర్పాటు చేస్తామని ప్రజల సమక్షంలో ప్రకటించారు.

**జిల్లా నుంచి కీలక పదవుల్లో ఉన్నా..**

ఉమ్మడి జిల్లాలకు చెందిన నాయకులు తెలంగాణ ఆవిర్భావానికి ముందు ఆ తర్వాత రాష్ట్ర రాజకీయాలలో కీలక పదవుల్లో ఉన్నప్పటికీ విమానాశ్రయ ఏర్పాటు కలగానే మిగిలింది. ఉమ్మడి రాష్ట్రంలో అసెంబ్లీలో స్పీకర్‌గా పనిచేసిన కె.ఆర్.సురేష్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన మండవ వెంకటేశ్వరరావు, సుదర్శన్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి మమ్మద్ అలీ, ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత మంత్రిగా పనిచేసిన, గత అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, గత ఎంపీ కల్వకుంట్ల కవిత, ప్రస్తుత ఎంపీ ధర్మపురి అరవింద్ ఎందరో కీలక పదవుల్లో ఉన్నారు.

**2021లో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నివేదిక..**

జిల్లాలోని జక్రాన్‌పల్లి వద్ద గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి గతంలోనూ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2021 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వానికి అందించగా తెలంగాణ విశ్వవిద్యాలయ శంకుస్థాపనకు వచ్చిన సమయంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్ట్‌కు హామీనిచ్చారు. ఆర్మూర్ నుంచి హైదరాబాద్ వెళ్లే రోడ్డులో యానంగుట్ట, తొర్లికొండ, కొలిప్యాక, అర్గుల్, జక్రాన్‌పల్లి, మనోహరాబాద్ గ్రామాల పరిధిలోని 1663 ఎకరాలలో విమానాశ్రయం నిర్మించాల్సి ఉంటుందని ఏఏఐ పేర్కొంది. ఇందుకు సంబంధించిన భూముల కోసం రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాల కిందనే భూ సర్వే నిర్వహించింది.

**ఎవరికి లాభం..?**

ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటయితే నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, ఆదిలాబాద్, నిర్మల్‌తో పాటు మహారాష్ట్ర సమీపంలోని నాందేడ్ వరకు ఉన్న ప్రజలకు గల్ఫ్ దేశాల్లో ఉపాధి నిమిత్తం వెళ్లే వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా ఎగుమతులు చేసేందుకు వీలుగా ఉంటుంది. రాష్ట్రంలో అత్యధికంగా నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాలలో పసుపు ఎక్కువగా పండిస్తున్నారు. వరి, మొక్కజొన్న, సోయా తదితర పంటలు సైతం ఈ ప్రాంతంలో ఎక్కువగా పండుతున్నాయి. ఈ పంట ఉత్పత్తులకు అదనపు విలువ జోడించి ఎగుమతులు చేసే యూనిట్లు ఏర్పాటు కావాలి. తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచొచ్చు. వీటన్నింటికి మార్గం సుగుణం కావాలంటే ఇక్కడ విమానాశ్రయం నిర్మించాల్సి ఆవశ్యకత ఉంది. పసుపు బోర్డు ఏర్పాటుతో అంతర్జాతీయ ట్రేడర్లు, వ్యాపారులు, సైంటిస్టులు, డెలిగేట్లు ఉన్నత అధికారులు రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. పసుపు ఎగుమతులు చేసేందుకు వీలుగా కార్గో విమానాలు సైతం నడిపించేందుకు విమానాశ్రయం ఏర్పాటు చేయాలని డిమాండ్లు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఇచ్చిన హామీని నెరవేర్చాలని ప్రజలు కోరుతున్నారు.

### విమానాశ్రయ ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలించాలి

- ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్



జిల్లాలోని జక్రాన్‌పల్లి వద్ద విమానాశ్రయ ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలించాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి కేంద్ర పౌర విమానాయన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడును ఎమ్మెల్యే ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని జక్రాన్‌పల్లిలో నూతన విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయాలని గతంలో పంపిన ప్రతిపాదనలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. విమానాశ్రయ ఏర్పాటు వల్ల చుట్టుపక్కల ప్రాంతాలు అభివద్ధితో పాటు తెలంగాణ విశ్వ విద్యాలయం, బాసర ట్రిపుల్ ఐటీకి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కోరారు. ఈ విమానాశ్రయ ఏర్పాటు వల్ల ఉత్తర తెలంగాణలో పారిశ్రామిక రంగం, ఉద్యోగ రంగం, వ్యవసాయ రంగం భవిష్యత్తులో మరింత అభివద్ధి చెందుతుందని వివరించారు.

# జిల్లాలో అడ్మిషన్ల దందా..?


- పది పరీక్షలు ప్రారంభం కాకముందే ఇంటర్‌లో ప్రవేశాలు
- నిబంధనలకు విరుద్ధంగా రూ.లక్షల్లో ఫీజు వసూలు
- విద్యార్థుల తల్లిదండ్రులకు ఎర
- జిల్లా పరిధిలో తిష్టవేసిన విద్యా సంస్థల పీఆర్వోలు
- పట్టించుకోని జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు



నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కార్పొరేట్ జూనియర్ కాలేజీల అడ్మిషన్ల దందా ప్రారంభమైంది. పదో తరగతి పరీక్షలు జరగకముందే కళాశాలలలో ప్రవేశాలకు తెరలేపాయి. తల్లిదండ్రుల జలహీనతలను ఆసరాగా చేసుకుని నిబంధలను తుంగలో తొక్కి 2025-26 విద్యాసంవత్సరం ప్రారంభానికి ఆరు నెలల ముందు నుంచే ప్రవేశాలు షురూ చేస్తున్నారు. ముందే అడ్మిషన్లు తీసుకుంటే ఫీజులో రాయితీ ఉంటుందని మభ్య పెడుతూ ప్రవేశాలు చేస్తున్నారు. అయినప్పటికీ జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల తల్లితండ్రులు సైతం కొద్ది రోజుల తర్వాత ఎక్కడ అడ్మిషన్లు దొరకదనే ఉద్దేశంతో అయోమయంలో తొందరపడుతూ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగిస్తున్నారు.

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఇంటర్ కార్పొరేట్ కాలేజీల్లో మెజార్టీగా హైదరాబాద్ చుట్టు పక్కల్లోనే ఎక్కువగా ఉన్నాయి. అందుకు అనుకూలంగా ఇంటి వద్ద ఉంటే విద్యార్థులు చదువుపై ఆశ చూపించాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు సైతం హాస్టల్లో ఉంచి చదివించేందుకు ముందుకు వస్తున్న తరుణంలో కార్పొరేట్ కాలేజీలు దానిని ఆసరాగా తీసుకుంటున్నారు. ఇంటర్ అకాడమిక్ ఇయర్ జూన్‌లో మొదలై మార్చిలో ముగుస్తుంది. కానీ ప్రస్తుత విద్యా సంవత్సరం ముగిసేందుకు ఇంకా గడువు ఉన్నా ఇప్పటి నుంచే అడ్మిషన్ల దందా చేపట్టడం గమనార్హం. జిల్లా కేంద్రంతో పాటు హైదరాబాద్‌లోని ఆయా కార్పొరేట్ కాలేజీలు పీఆర్‌వోలను నియమించుకుని జేఈఈ, నీట్‌లో స్పెషల్ కోచింగ్ ఇస్తామంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు ఎర వేస్తున్నారు. దాదాపు రూ.4 నుంచి 5లక్షల వరకు ఫీజు నిర్ణయించారు. ముందుస్తు అడ్మిషన్లు తీసుకుంటే రూ.3 నుంచి 4లక్షల వరకు ఉంటుందని తల్లిదండ్రులకు ఆశ చూపుతున్నారు. ఉన్న సీట్ల కంటే తక్కువగా కొరతను సష్టించి మరీ సీట్లను కట్టబెడుతున్నారు. కొన్ని చోట్ల ప్రయివేటు విద్యా సంస్థలను కలుస్తూ తమ కళాశాలకు అడ్మిషన్లు ఇప్పివ్వాలంటూ ఆఫర్లు ప్రకటిస్తున్నట్టు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.




చదువులో మెరుగ్గా ఉన్న విద్యార్థుల వివరాలను తీసుకుని వారి తల్లిదండ్రులను కలుస్తున్నారు. అడ్మిషన్ల ప్రక్రియను ముందే చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. పరీక్షలు పూర్తయిన తర్వాత ఫలితాలు వెలువడిన తర్వాత మే, జూన్ సమయంలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. కానీ నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి నుంచే ప్రక్రియను మొదలు పెట్టారు. నిబంధనలను గాలికి వదిలి అడ్మిషన్లు తీసుకుంటున్నా జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇంటర్‌లో అడ్మిషన్ల కోసం కార్పొరేట్ కాలేజీలు పీఆర్వో వ్యవస్థను ఏర్పాటు చేసుకుని నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆయా కళాశాల యాజమాన్యాలను కలుస్తూ అదేవిధంగా జిల్లా కేంద్రంలోని 60 డివిజన్లతో పాటు నిజామాబాద్ జిల్లాలో పలు మండల, గ్రామాలు, ఏరియాల్లోని ప్రయివేటు, సర్కారు స్కూళ్లలో పదో తరగతి చదివే విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లు సేకరిస్తున్నారు. తమ కళాశాలలో మెరుగ్గా సౌకర్యాలు ఉన్నాయనీ, ఫలితాలు బాగున్నాయని అడ్మిషన్లు తీసుకోవాలని చెబుతున్నారు. వివిధ విభాగాల్లో మంచి సీటు లభిస్తుందని పేర్కొంటున్నారు.

ఇందుకుగాను స్కూల్ వారికి కార్పొరేట్ కాలేజీలు నగదు లేదంటే బహుమతులు ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నట్లు పలువురి ద్వారా తెలిసింది. ఏసీ, నాన్ ఏసీ పేర్లతో అడ్మిషన్ల ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ఒక్కో పేరెంట్ నుంచి సుమారు 20 వేల నుంచి రూ.50వేల వరకు అడ్వాన్స్ తీసుకుని సీట్ రిజర్వు చేస్తున్నారు. అయితే, పదో తరగతి ఫలితాలు వచ్చాక ఆ కాలేజీలో చేరేందుకు విద్యార్థి నిరాకరిస్తే తిరిగి డబ్బులు ఇవ్వడంపై గతంలోనూ అనేక ఘటనలు వెలుగు చూశాయి. ఇప్పటికైనా ఇంటర్ బోర్డు, విద్యాశాఖ అధికారులు స్పందించి, కార్పొరేట్ కాలేజీల ముందస్తు అడ్మిషన్ల దందాకు చెక్ పెట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

### చూసీచూడనట్టు ఇంటర్ విద్యాశాఖ అధికారులు



నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఒకపక్క ఇంటర్మీడియట్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు మొదలవుతున్నా.. మరో పక్క ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు చట్టాలను తుంగలో తొక్కి 2025-26 అకాడమిక్ ప్రారంభం కాకముందే పిఆర్ఓలతో ముందస్తుగానే అడ్మిషన్లను చేస్తున్నారు. ఇవన్నీ జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారులకు తెలిసినా తూతూ మంత్రంగా వ్యవహరించడం సరికాదు. వెంటనే విద్యాశాఖ అధికారులు మొద్దు నిద్ర లేచి అక్రమంగా అడ్మిషన్లు చేయిస్తున్న కాలేజీలపైన చర్యలు తీసుకోవాలి.

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్

# ఆకర్షించే ప్రకటనలే..

- ఇష్టానుసారంగా వెలుస్తున్న ప్రయివేటు హాస్టల్స్
- కనీస నిబంధనలు పాటించని వైనం
- పట్టించుకోని అధికారులు

'మా హాస్టల్‌లో ఇంటిని మైమరిపించే విధంగా అమ్మ చేతి వంట ఉంటుంది. రుచికరమైన భోజనాన్ని మా హాస్టల్లో అందిస్తాం.' అంటూ ప్రైవేట్ హాస్టల్ యజమాన్యాలు తమ హాస్టల్ భవనాల ముందర పెద్ద పెద్ద ఫ్లెక్సీలతో బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఆ హాస్టల్స్ యాజమాన్యాలు కనీస నిబంధనలు పాటించడం లేదు. హాస్టల్‌లో ఉండే విద్యార్థులు, అభ్యర్థుల వద్ద ముక్కు పిండి ఫీజు వసూలు చేయడమే ధ్యేయంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఇష్టానుసారంగా ప్రయివేటు హాస్టల్స్ వెలుస్తున్నాయి. వీటిపై అధికారుల పర్యవేక్షణ మాత్రం కరువవుతోంది.

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

**ఆకర్షించే ప్రకటనలు..**

ప్రయివేటు హాస్టల్స్‌లో 'మినరల్ వాటర్, ఫ్రీ వైఫై, 24 గంటల సీసీ కెమెరాల పర్యవేక్షణ, ఉచిత దినపత్రికలు, సెక్యూరిటీ (వాచ్‌మెన్), ప్రతినిత్యం కోడిగుడ్డు, అరటిపండు ఇస్తాం. అలాగే అలాగే ఉదయం అల్పాహారం, డాక్టర్ల సూపర్వైజింగ్, ఇలా అనేక రకాల సౌకర్యాలు మావద్ద లభిస్తాయంటూ ఎవరికి నచ్చినట్టుగా వారు ఆకర్షించే ప్రకటనలు ఇస్తున్నారు. అంతేకాకుండా చలికాలంలో వేడి నీళ్లు మా హాస్టల్ ప్రత్యేకమంటూ జిల్లా కేంద్రంలో ప్రతి కాలనీలో విచ్చలవిడిగా ఇష్టానుసారంగా ప్రైవేటు హాస్టల్స్ వెలుస్తున్నాయి.

**ఈ ప్రాంతాల్లో ఎక్కువగా..**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖలీల్‌వాడీ, ముబారక్‌నగర్, ఆర్మూర్ రోడ్, వర్ని రోడ్డు, దుబ్బారోడ్డు, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో సుమారు 100 లోపు హాస్టల్స్ ఉన్నాయి. అయితే ఒక్కో అభ్యర్థికి నెలకు సుమారు రూ.3500 నుంచి 4500 వరకు హాస్టల్ ఫీజును వసూలు చేస్తున్నారు. సొంత భవనాలు కాకుండా.. కేవలం అద్దెకు భవనాలను తీసుకుని హాస్టల్స్‌ను నిర్వహిస్తున్నారు. దీంతో ఒక్కో గదిలో సుమారు 5 - 10 మంది వరకు ఉంచుతున్నారు.

**ఇదీ వ్యవహారం..**

ప్రతి హాస్టల్‌లో ఉండే అభ్యర్థుల, విద్యార్థులు పొద్దున హాస్టల్ నుంచి బయటకు వెళ్లే సమయంలో అటెండెన్స్ తీసుకుంటున్నారు. రాత్రి వచ్చే సమయానికి అటెండెన్స్ తీసుకుంటున్నారు. అంతవరకు మాత్రమే వారి బాధ్యత. మిగతా సమయాల్లో వారిది ఎలాంటి బాధ్యత ఉండదు. హాస్టల్లో అడ్మిషన్ పొందే సమయంలో ఆధార్ కార్డు మాత్రమే తీసుకుంటున్నారు.

**పట్టించుకోని అధికారులు..**

ప్రయివేటు హాస్టల్స్ యాజమాన్యాలు కనీస నిబంధనలు పాటించడం లేదు. దీనికి తోడు అధికారుల పర్యవేక్షణ సైతం కరువైంది. హాస్టల్‌లో ఉండే విద్యార్థులు రోజులో ఏం చేస్తున్నారు..?, ఎటువైపు తిరుగుతున్నారు..? అనే పర్యవేక్షణ కరువవుతోంది. ప్రతి ప్రైవేట్ హాస్టల్లో మున్సిపాలిటీ శానిటేషన్ అధికారులు శానిటేషన్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదు. ఏ హాస్టల్‌లో ఎంత మంది విద్యార్థులు ఉంటున్నారనే సమాచారం అధికారుల వద్ద ఉండాలి. అలాగే హాస్టల్స్‌లో ఆహారం నాణ్యతగా ఉంటుందా లేదా అనేది పరిశీలించాలి. కానీ ప్రయివేటు హాస్టల్స్‌ను తనిఖీ చేసిన నాథుడే లేడు. అధికారుల పర్యవేక్షణ కరువవడంతో యాజమాన్యాలు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. హాస్టల్స్ అనుకోని ఘటనలు జరిగితే బాధ్యులెవరని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కనీస నిబంధనలు పాటించని హాస్టల్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నగరంలో ప్రయివేటు హాస్టల్ యాజమాన్యాలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

# ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి విఫలయత్నం

- వాచ్‌మెన్, ఆపరేటర్‌లపై దాడిచేసి.. బంధించి
- ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించిన పోలీసులు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం మంజీర సమీపంలో గల లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసంచేసే విలువైన పరికరాలను దొంగిలించడానికి దొంగలు చేసిన ప్రయత్నం విఫలం కావడంతో అక్కడ నిద్రిస్తున్న వాచ్‌మెన్, ఆపరేటర్‌లను బంధించి దాడిచేసిన ఘటన కలకలం రేపింది. ఆపరేటర్ లక్ష్మణ్, వాచ్‌మెన్ నర్సయ్య తెలిపిన కథనం ప్రకారం.. శనివారం రాత్రి 11.30 గంటలకు 8 మంది సభ్యులు గల దొంగల ముఠా మంజీర సమీపంలోని లిఫ్టబావి వద్దకు వచ్చారు. వారికి వాచ్‌మెన్ నర్సయ్య, లిఫ్ట్ ఆపరేటర్ లక్ష్మణ్ కంటపడడంతో వారి కాళ్లు కట్టేసి బంధించి దాడి చేశారు. అనంతరం ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగిలించే క్రమంలో దానికున్న వైర్లను తొలగించారు. చివరగా ట్రాన్స్‌ఫార్మర్ బిగింపునకు ఉన్న వెల్డింగ్ తొలగించడం సాధ్యం కాకపోవడంతో దొంగలు వెనుదిరిగారు. అనంతరం అక్కడ ఉన్న బాధితులకు సంబంధించిన ద్విచక్ర వాహనాన్ని ధ్వంసంచేసి బ్యాటరీ తీసుకుని వెళ్లిపోయారు. అనంతరం బాధితులు ఎలాగోలా తప్పించుకుని గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో ఘటన సమాచారం ఊర్లో దావానంలా వ్యాపించింది. గతంలోనూ రెండుసార్లు దొంగలు ఇక్కడే ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసంచేసి విలువైన పరికరాలు దొంగిలించారు. సమాచారం తెలుసుకున్న బోధన్ రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సంబంధిత శాఖ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మచ్చేందర్‌రెడ్డి తెలిపారు.



ట్రాన్స్ ఫార్మర్

## బ్రిడ్జిని పూర్తిచేయాలని గ్రామస్తుల ధర్నా



నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మామిడిపల్లి గ్రామ శివారులోగల 63వ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న రైల్వే బ్రిడ్జి త్వరగా పూర్తిచేయాలని గ్రామస్తులు ఆదివారం రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైల్వే బ్రిడ్జి పనులు గత కొన్ని సంవత్సరాలుగా కొనగుతున్నాయని, దీనివల్ల వాహనాలు గ్రామంలోకి వచ్చి వెళ్ళడం వల్ల ఇండ్లలోకి దుమ్ము ధూళి చేరి అనారోగ్యాలకు గురవుతున్నట్టు తెలిపారు. గ్రామంలో చిన్నారులు తిరగాలంటే భయంగా ఉందని అన్నారు. వాహనాలు ఏకధాటిగా గ్రామంలోకి రావడంవల్ల ప్రమాదాలు జరుగుతాయని, వెంటనే బ్రిడ్జి పనులు పూర్తి చేసి రోడ్డును ప్రారంభించాలని కోరారు. గ్రామస్తులు అరగంట పాటు ధర్నా నిర్వహించి విరమించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## దేగాంలో కత్తిపోట్ల కలకలం



నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూరు మండలంలోని దేగాం గ్రామంలో ఆదివారం కత్తిపోట్ల ఘటన తీవ్ర కలకలం రేపింది. గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన కత్తి శ్రీధర్, శ్రీకాంత్ పాత కక్షలతో నాగరాజుపై కత్తితో దాడి చేశారని, దీంతో నాగరాజుకు తీవ్ర గాయాలు కాగా ఆర్మూర్ ఆసుపత్రికి తరలించినట్టు స్థానికులు తెలిపారు. పరిస్థితి విషమించడంతో నిజామాబాద్ జిల్లా కేంద్రానికి తరలించారు. అశోక్, శేఖర్, శ్రీలత సైతం చేతులతో నాగరాజు పై దాడికి పాల్పడినట్టు బాధితుడు తెలిపాడు. విషయం తెలిసిన పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించినట్టు ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణ గౌడ్ తెలిపారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం వారిని నిజామాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## రైతు సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

- సంఘం రాష్ట్ర కోశాధికారి కంజర భూమయ్య



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కోశాధికారి భూమయ్య

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర కోశాధికారి కంజర భూమయ్య అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో నగరంలోని సంఘ కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి వ్యతిరేకంగా తెచ్చిన 3 నల్ల చట్టాలను రద్దు చేయాలని, జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన పసుపు బోర్డుకు నిధులు కేటాయించాలని తెలిపారు. స్వామినాథన్ సిఫారసు ప్రకారం రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 25,26,27 తేదీల్లో నగరంలోని మాధవ నగర్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మూడవ మాసభలను జిల్లా రైతాంగం, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు పి.సుధాకర్, కార్యదర్శులు పి.ముత్యాలు, పి.రంజిత్, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి అడ్డికే. రాజేశ్వర్ పాల్గొన్నారు.

## దుద్దిళ్ల శ్రీపాదరావుకు నివాళి



దుద్దిల్ల శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిజామాబాద్ అదనపు డీసీపీ అడ్మిన్ బసవ రెడ్డి ఆధ్వర్యంలో దుద్దిల్ల శ్రీపాదరావు 90వ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుద్దిళ్ల శ్రీపాదరావు ఫొటోకు అదనపు డి.సి.పి (అడ్మిన్) పూలమాల వేసి మాట్లాడారు. శ్రీపాదరావు 1935 మార్చ్02 న కాటారం మండలం ధన్వాడ గ్రామంలో జన్మించారని తెలిపారు. ఈయన మూడుసార్లు శాసనసభ సభ్యులుగా ఎన్నికై, శాసనసభ స్పీకర్‌గా పని చేశారన్నారు. ఈయన ప్రజల మధ్య ఉంటూ వారి బాగోగులను పట్టించుకునే వారని, 1999 ఏప్రిల్ 13 సంవత్సరంలో మహాదేవపూర్ మండలం అన్నారంకు తన అనుచర వర్గంతో వెళ్ళి వస్తున్న సమయంలో మార్గమధ్యంలో అడవుల్లో ఆయన వాహనాన్ని నక్సలైట్లు ఆపి ఆయనతో మాట్లాడాలని చెప్పి చంపేశారన్నారు. ఆయన ఇప్పటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో అదనపుడిసిపి ఏఆర్ రాంచందర్ రావు, ఆఫీసు సూపరింటెండెంట్ శంకర్, ఆర్ఐ (వెల్ఫేర్) శ్రీనివాస్, పోలీస్ కార్యాలయ సిబ్బంది, సిసి ఆర్‌బి సిఐ సతీష్, సిబ్బంది, సిఎస్బి, ఆర్ఎస్ఐ నిషిత్, ఐటి కోర్, పోలీస్ కంట్రోల్ రూమ్, సెంట్రల్ కంప్లైంట్ సెల్, స్పెషల్ పార్టీ సిబ్బంది హాజరయ్యారు.

## లయన్స్ సేవలను మరింత విస్తరించాలి

- లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ 62వ వార్షికోత్సవం




మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగర శివారులోని కమ్మసంఘ భవనంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ 62వ వార్షికోత్సవం అట్టహాసంగా ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లయన్స్ జిల్లా గవర్నర్ నగేష్ పంపటి ముఖ్యాతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లయన్స్ సేవలను మరింతగా విస్తరించాలని సూచించారు. కొత్త వారిని తీసుకువచ్చి సేవా కార్యక్రమాల్లో మమేకం చేయాలన్నారు. ప్రోగ్రామ్ చైర్మెన్ డి.నర్సింహరాజు, లయన్స్ పూర్వ గవర్నర్లు ప్రకాష్ రావ్, లక్ష్మి, పెంటయ్య బసవేశ్వర రావు, గందాని శ్రీనివాసరావు, ఓబుల్ రెడ్డి, వీటీ రాజ్ కుమార్, వీరేశం, జిల్లా కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి మధు, లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ అధ్యక్ష కార్యదర్శులు అవన్ కుమార్, శంకర్, కోశాధికారి జయంత్, రీజియన్ చైర్మెన్ అనిల్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ దినోత్సవంలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలి ప్రతిభ



నవతెలంగాణ-ఆర్మూర్

జాతీయ సైన్సు దినోత్సవ సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణంలోని కేజీబీవీ జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు హనుమాన్లు స్రవంతి ప్రతిభ కనపరిచారు. ఈ సందర్భంగా ఆదివారం నవతెలంగాణతో మాట్లాడుతూ.. సైన్స్ ఇన్ ఓవర్ వరల్డ్ అనే అంశంపై రాసిన పేపర్లు ఎంపిక అయ్యాయని అన్నారు. 165 మంది ప్రముఖులు రాసిన పేపర్ల నుండి కేవలం రాష్ట్రవ్యాప్తంగా 31 ఎంపిక చేయగా అందులో ఒకటి తనదని తెలిపారు. జిల్లా నుండి ఉపాధ్యాయురాలు ఎంపిక కావడం ఇది ఐదవ సారి. ఎస్‌సిఈఆర్‌టి వారి సర్టిఫికెట్లు అందుకున్నారు. వీరు ప్రచురించిన పుస్తకంలో పేపర్లను సైతం ముద్రించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రత్యేక అధికారిని గంగామణి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# ప్రత్యేక బస్సులు నడపండి.. సారూ..

- 5నుంచి ఇంటర్ పరీక్షలు
- ఫ్రీ బస్సులతో గంటల తరబడి పడిగాపులు
- ఇబ్బందులు తప్పవని విద్యార్థుల ఆందోళన




నవతెలంగాణ-బాల్కొండ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకంగా మహాలక్ష్మి పథకం ద్వారా బస్సుల్లో ఉచితంగా ప్రయాణం కల్పించింది. ప్రస్తుతం ఈ పథకం ద్వారా ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఇంటర్ పరీక్షల నేపథ్యంలో ఈ పథకం విద్యార్థులకు శాపంగా మారనుందా... అంటే అవుననే చెప్పాలి. గంటల తరబడి విద్యార్థులు బస్ స్టాప్ ల వద్ద బస్సుల కోసం ఎదురుచూస్తూ రోడ్డుపై పడి కాపులు కాస్తున్నారు. వచ్చే బస్సు ఎప్పుడు వస్తుందో తెలియదు, బస్సు వచ్చిన బస్ స్టాప్‌లో ఉన్న జనాలను చూసి ఆపకుండా వెళ్ళిపోతుంది. దీంతో విద్యార్థులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

**అధికారులు ప్రత్యేక బస్సులపై శ్రద్ధ చూపాలి..**

ఇంటర్ పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు చేసిన ఉన్నతాధికారులు బస్సులపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి సమయపాలన పాటించాలి. ఇంటర్ పరీక్షల నేపథ్యంలో బస్ స్టాప్‌ల వద్ద బస్సులు నిలిపే విధంగా చూడాలి. విద్యాశాఖ, రోడ్డు రవాణా శాఖలు పరస్పరంగా చర్చించి ప్రత్యేక బస్సులు నడిపే విధంగా చర్యలు తీసుకోవాలి.

**పరీక్షల వేళ మానసిక ఆవేదన..**

పరీక్షలు అంటే విద్యార్థులు ముందే మానసిక ఆందోళ నకు గురవుతారు. పరీక్ష రోజు విద్యార్థులు సతమతమవు తూ ఇంటి నుంచి బయలుదేరి తీరా బస్సులో ప్రయాణం అ నే సరికి మరింత ఆందోళనకు గురయ్యే పరిస్థితి నెలకొంది.

**విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు కేటాయించాలి..**

ఈనెల 5 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షల నేపథ్యంలో అధికారులు విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు కేటాయించాలని కోరుతున్నారు. బాల్కొండ మండల పరిధిలోని సమీప గ్రామాల విద్యార్థులు కిసాన్ నగర్, బాల్కొండ చిట్టాపూర్ మీదుగా ఆర్మూర్, నిజామాబాద్ కు ఎక్కువగా ఇంటర్ విద్యార్థులు విద్యాభ్యాసం కోసం వెళ్తుంటారు. ఇంటర్ పరీక్షల దృశ్యా నిర్మల్, ఆర్మూర్, నిజామాబాద్ డిపో బస్సులు ఈ రూట్లో విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు కేటాయించి సమయపాలన పాటించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇంటర్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 9 గంటల వరకు పరీక్ష కేంద్రంలో ఉండాలనే నిబంధన ఉంది.

# చోరీకి పాల్పడ్డ నిందితుడి అరెస్ట్

- మూడు లక్షల 20వేల నగదు.. 19 తులాల బంగారం, 500 గ్రాముల సిల్వర్ స్వాధీనం
- వివరాలను వెల్లడించిన ఏసిపి రాజా వెంకట్ రెడ్డి




మాట్లాడుతున్న ఏసిపి రాజా వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

కరడుగట్టిన అంతర్రాష్ట్ర దొంగను ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. తాళం వేసి బయటకు వెళ్తున్నారా తస్మాత్ జాగ్రత్త.. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ క్షణాల వ్యవధిలో ఇంట్లోకి చొరబడి ఇంట్లో ఉన్న సొత్తును దోచుకుంటున్న నిందితున్ని నిజామాబాద్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను ఏసిపి రాజా వెంకట్‌రెడ్డి ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వరంగల్ ప్రాంతానికి చెందిన సయ్యద్ అమీద్ అనే వ్యక్తి హైదరాబాద్‌లో నివాసం అంటూ పలు ప్రాంతాలలో చోరీకి పాల్పడుతున్నట్టు తెలిపారు. కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఫిబ్రవరి 27న పట్టపగలే నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీ, గంగస్థాన్ ఫేస్ 3 ఏకశిలా నగర్ ప్రాంతాల్లో ఉన్న బాధితులు ఇంటికి తాళం వేసి గుడికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన నిందితుడు సయ్యద్ ఆమీద్ మూడిళ్లలో చోరికీ పాల్పడి రూ.3లక్షల20వేల నగదు, 19 తులాల బంగారం, 500 గ్రాముల వెండి దోచుకెళ్ళాడని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సౌత్ నార్త్‌రీరల్ పోలీసులు కేసుని కేసును సీరియస్‌గా తీసుకొని దర్యాప్తు చేపట్టారు. దొంగతనం జరిగిన ప్రాంతాల్లో సిసి ఫుటేజీలను పరిశీలించిన తరువాత నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం ఉదయం నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్‌లోని బైపాస్ రోడ్‌లో వాహనాలు తనిఖీలు నిర్వహించగా అనుమానాస్పదంగా ఓ వ్యక్తి బ్లూ కలర్ హెరీండా ఆక్టివా పై నిజామాబాద్ వైపు వస్తున్నాడు. రూరల్ పోలీస్ సిబ్బంది ఆయన్ను ఆపి తనిఖీ చేయగా నగదు, బంగారం, వెండి, స్క్రూ డ్రైవర్, ఇనుప సుత్తి అగుపించడంతో వెంటనే విచారించారు. గత నెల 27న మూడు ఇళ్లలో చోరికి పాల్పడినట్టు ఒప్పుకున్నాడని ఏసీపి తెలిపారు. నిందితుడు 15 సంవత్సరాల నుంచి దొంగతనాలకు పాల్పడుతుండే వాడని, గతంలో చందానగర్, నిజామాబాద్, బోధన్, రెంజల్, సరూర్ నగర్, ఎడపల్లితోపాటు కర్ణాటక రాష్ట్రంలో కూడా దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. ఆయనపై దాదాపుగా 85కు పైగా కేసులు ఉన్నాయని, 2018 ఈయనపై నాచారం పోలీస్ స్టేషన్‌లో పీడీ యాక్ట్ కూడా నమోదయిందని తెలిపారు. 48 గంటల్లో దొంగతనం కేసును చాకచక్యంగా చేదించిన నార్త్ సిఐ, సౌత్ సిఐ, నిజామాబాద్ రూరల్ ఎస్ఐ, మాక్లూర్ ఎస్ఐ సిబ్బందిని ఏసీపి అభినందించారు. వీరికి త్వరలోనే రివార్డును ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో సౌత్ రూరల్ సీఐ సురేష్, నార్త్ సిఐ శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ ఆరిఫ్, మాక్లూర్ ఎస్ఐ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసిన నాయకులు



ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని సిరికొండలో ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి వెళ్తున్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డిని ఇందల్ వాయి మండల కేంద్రంలోని టోల్ ప్లాజా వద్ద పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. కలిసిన వారిలో ఇందల్ వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్, రూరల్ అధ్యక్షులు చిన్ రెడ్డి సంతోష్ రెడ్డి, డాక్టర్ సామల రాజేష్, సంతోష్ రెడ్డి (అమ్సన్ పల్లి),బద్దం రెడ్డి, మల్లేష్ రెడ్డి, మాజీ మండల వైస్ చైర్మన్ పూర్య నాయక్, నాయిని సాయిలు, దశరథ్ తోపాటు తదితరులు ఉన్నారు.

## మెగా హెల్త్ క్యాంప్



మెగా హెల్త్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న హాస్పిటల్ డైరెక్టర్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

పట్టణ కేంద్రంలోని శ్రీ శివసాయి హాస్పిటల్ ప్రారంభించి 5వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సాయికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బడా భీంగల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను గ్రామ వీడిసి అధ్యక్షుడు సాయిబాబా, ఆస్పత్రి మేనేజ్మెంట్ డైరెక్టర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజ్మెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ.. హాస్పిటల్ ప్రారంభించినప్పటినుండి ఇప్పటి వరకు 22 ఉచిత క్యాంపులు నిర్వహించామని తెలిపారు.

ఈ క్యాంపులో అనుకున్న దాని కంటే ఎక్కువగా ప్రజలు వచ్చి వైద్యం చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. సుమారు 100 మంది చిన్న పిల్లలకు, 300 మంది పెద్దలు ఉచిత క్యాంపులో పాల్గొన్నారు. వారందరికీ ఉచిత వైద్య పరీక్షలు, వైద్యం చేసి, మందులు అందజేశారు. అనంతరం బడా భీంగల్ గ్రామ వీడీసీ అధ్యక్షులు సాయిబాబా, మాజీ వీడీసీ అధ్యక్షులు కిషన్ మాట్లాడుతూ.. శివ సాయి హాస్పిటల్ వారు ఏర్పాటుచేసిన క్యాంపును బడాభీంగల్ ప్రజలు ఉపయోగించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సూర్య నారాయణ జనరల్ సర్జన్, డాక్టర్ జైపాల్ ఎంబిబిఎస్ డి.ఎన్.బి పిడియాట్రిక్, చిన్న పిల్లల వైద్య నిపుణులు, డాక్టర్ ప్రదీప్తి స్త్రీ వైద్య నిపుణులు, డాక్టర్ అనిల్ కుమార్ క్రిటికల్‌కేర్ జనరల్, బడా భీంగల్ వెల్డింగ్ శీను, వీడీసీ ఉపాధ్యక్షులు దండు మహేష్, వీడీసీ సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారు

- బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాయకుడు సంతోష్



నవతెలంగాణ-ముప్కాల్

తాజా మాజీ సర్పంచ్ కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాయకుడు సంతోష్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం సంతోష్ కుమార్ తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ముస్కు భూమేశ్వర్‌పై మండల కేంద్రంలో భూ కబ్జాలకు పాల్పడుతూ.. ప్రభుత్వ భూములను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. వీరిపై చర్యలు తీసుకోవాలని రెవిన్యూ అధికారులకు పలుమార్లు కోరిన పట్టించుకోవడం లేదన్నారు.

తాజా మాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్ హైకోర్టును తప్పుదోవ పట్టిస్తు తను అక్రమంగా కబ్జా చేసుకున్న లక్ష్మీ కాలువ ఇరిగేషన్ భూములు (సర్వే నంబర్లు 70/1, 70/2,70/3) దాదాపు 400 గజాలకు పైగా కబ్జా చేసుకొని రెండు మడిగెలు నిర్మించి కిరాయిలకు ఇచ్చారని ఆరోపించారు. వ్యాపార దుకాణాలను తొలగించాలని నీటిపారుదల శాఖ ఆదేశాలు జారీ చేసినప్పటికీ, మాజీ సర్పంచ్ అధికారులను తప్పుదోవ పట్టిస్తూ కోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకున్నట్లు అబద్ధం ప్రచారం చేస్తున్నారని, నిర్మించిన మడిగెలను కూల్చివేత ఆపాలని ఆర్డర్ లేదని ఈ సందర్భంగా అన్నారు. ఈ విషయంను ఇరిగేషన్ అధికారులకు, తహశీల్దార్‌కు రాత పూర్వకంగా ఇచ్చిన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఇరిగేషన్, రెవిన్యూ అధికారులు సదరు మాజీ సర్పంచ్ కు పూర్తిగా సహకారాన్ని అందించారని ఆరోపించారు. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక ముఖ్య నాయకుడు ఈ విషయంలో మాజీ సర్పంచ్ ను కాపాడే ప్రయత్నం చేస్తున్నాడని అన్నారు. అప్పటికప్పుడు దాదాపు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల రూపాయల మేర కోర్టుకు రుసుం చెల్లించి 'లంచ్ మోషన్' తెచ్చుకోవడం జరిగిందని తెలిపారు. నూతనంగా నిర్మించిన మణికంఠ ఏసీ గార్డెన్ కు పర్మిషన్ ఇవ్వలేదని, గార్డెన్ నుంచి బయటకు వెళ్లే డ్రైనేజీని లక్ష్మీ కాలువకు పైపు లైన్ ద్వారా కలపడం ఇలాంటి ఆధారాలను తను ఇరిగేషన్, రెవిన్యూ అధికారులకు, కోర్టుకు సైతం సమర్పించారని అన్నారు. ఇకనైనా సదరు సర్పంచ్‌కు ఇరిగేషన్, రెవిన్యూ అధికారులు వత్తాసు పలుకాకుండా నీతి నిజాయితీతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి సహకారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. లేదంటే అధికారులపై తగు చర్యలు తీసుకునేలా ముందుకు వెళ్తానని హెచ్చరించారు.

## జాతీయ వేదిక్ మ్యాథ్స్‌లో లిటిల్‌ఫ్లవర్ విద్యార్థికి ప్రథమ స్థానం

- ఐదువేల ప్రోత్సాహ బహుమతి
- నేషనల్ వేదిక్ మ్యాథ్స్ ప్రథమ స్థానంలో వెలసిన




విద్యార్థికి బహుమతి అందజేత

పతెలంగాణ-మెండోర

జాతీయ స్థాయి వేదిక్ మ్యాథ్స్ కాంపిటీషన్‌లో వెల్గటూర్ లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థి ప్రథమ స్థానంలో నిలిచాడు. లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థి ఎస్.మనిదీప్(8వ తరగతి) హైదారాబాద్‌లో ఆదివారం విశ్వం ఎడ్యుకేట్ వారు నిర్వహించిన వేదిక్ మ్యాథ్స్ జాతీయ పోటీలో ప్రథమ స్థానం సాధించి ఐదు వేల రూపాయలు ప్రోత్సాహ బహుమతి అందుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ అజ్మత్ పాషా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వం ఎడ్యుకేట్ వారు నిర్వహించిన వేదిక్ మ్యాథ్స్ రాష్ట్ర స్థాయి పోటీలలో మనిదీప్ పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి ఎంపిక కాగా ఆదివారం హైదారాబాద్ లో విశ్వం ఎడ్యుకేట్ వారు నిర్వహించిన జాతీయ స్థాయి వేదిక్ మ్యాథ్స్ పోటీలో మణిదీప్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు తెలిపారు. ఇందులో ప్రథమ స్థానంలో నిలిచి 5000 వేల రూపాయల ప్రోత్సాహ బహుమతి అందుకున్నాడని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ప్రిన్సిపల్ అజ్మాత్ పాషా ఆనందం వ్యక్తం చేశారు. మనిదీప్‌ను పాఠశాల ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

## స్వామి వారి ద్వితీయ వార్షికోత్సవం

నవతెలంగాణ-ముప్కాల్

'శ్రీ లక్ష్మీ నరసింహస్వామి' ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం నుంచి ఈ నెల 4వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గురడి రెడ్డి సంఘం పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. 4న మంగళవారం అభిషేకం, హెూమం ఉంటుందని అన్నారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. రానున్న భక్తుల సౌకర్యార్థం ఆలయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గురడి రెడ్డి సంఘం పెద్దలు, అర్చకులు వెంపటి గణేష్ కుమార్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

మండలకేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు, కళ్యాణం, అన్న సత్రం రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు అధ్యక్షుడు గంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
సోమవారం | మార్చి 03, 2025 | www.navatelangana.com

## ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

- ప్రొఫెసర్ శైలజ



**నవతెలంగాణ-తాడ్వాయి**

విద్యార్థులు భయం వీడి ఆత్మవి శ్వాసంతో పరీక్షలు రాయాలని ఉస్మాని యా యూనివర్సిటీ ప్రొఫెసర్ సిహెచ్ శైలజ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశా లను సందర్శించి విద్యార్థులకు పలు మెలుకువలు సూచించారు. ఏకాగ్రతతో ఉండి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తే అనుకున్న మార్కులు పొందుతారని అన్నారు. పరీక్ష సమయంలో భయాందోళనకు గురుకావొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.సురేఖ. ఉపాధ్యాయ బృందం విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్



**నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)**

ఎల్లారెడ్డి మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన బయాగోని నారాయణ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ఆహ్వానం మేరకు ఆదివారం మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ హాజరైన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు సొసైటీ డైరెక్టర్ చెన్నంగారి సుఖేందర్‌రెడ్డి, సాయిలు, రాము, గోపాల్, సంగమేష్, బాలప్ప, మల్లేష్, గోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కర్బూజా సాగు.. బహుబాగు..

## 45రోజులైతే పంట చేతికి..



నాది పడంపల్లి గ్రామం. 5 ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. అందులో రెండు ఎకరాలు కర్బూజ పంట పండిస్తున్నాను. పంట విత్తుకుని 20 రోజులు అవుతోంది. ఇతర రైతులను చూసి నేను కూడా కర్బూజా పంటను సాగుచేస్తున్నాను. ఇంకో 45 రోజులైతే కాయలు కోతకు వస్తాయి.

**– కౌలు రైతు సూర్యకాంత్, పడంపల్లి గ్రామం.**

## కొత్తగా సాగుచేశాను..



నాకున్న భూమిలో మూడెకరాలు కర్బూజా పంటను వేశాను. ఇప్పటికే రెండున్నర లక్షల రూపాయలపైనే ఖర్చు పెట్టాను. పంట సాగుచేసి 20 రోజులు కావొస్తుంది. నిత్యం ఒకరోజు తప్పించి రెండవ రోజు ఏదో రసాయన ఎరువులు కచ్చితంగా పంటకు వేయాల్సిందే. ఖర్చుతో కూడుకున్నదైనా అనుభవం లేకున్నా ఈసారి కొత్తగా పంటను వేశాను. కోత కోసే సమయానికి ఏ ధర ఉంటుందో తెలియదు.

**– సురేష్ పడంపల్లి గ్రామ రైతు**



- వాణిజ్య పంటల వైపు రైతుల మొగ్గు
- మార్కెట్లో రేటును బట్టి లాభాలు
- ఏటికేడు సాగులో పెరుగుదల

**నవతెలంగాణ-జుక్కల్**

జుక్కల్ మండలంలోని పలు గ్రామాలలో రైతులు వాణిజ్య పంట అయిన కర్బుజా సాగుకు మొగ్గు చూపుతున్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ఇంతింతై వటుడింతై అన్నట్టుగా సంవత్సరం సంవత్సరం పంట పండిస్తున్న రైతులు ఎక్కువగా కావడం మంచి పరిణామంగా చెప్పవచ్చు.

కర్బుజా పంట జుక్కల్ మండలంలోని మొత్తం 39 వేల ఎకరాలు సాగులో ఉండగా.. అందులో గ్రామాలలో సుమారుగా 1500 ఎకరాలు కర్బూజ పంటను పండిస్తున్నారు. కర్బుజా పంట మొదటి నుండి ఖర్చుతో కూడుకున్నదైనా మార్కెట్లో మంచి రేటు వస్తే ఎకరాకు లక్ష పైనే మిగులుతుందని, రేటు కలిసి వస్తే రెండు మూడు లక్ష లైనా మిగులుబాటు ఉంటుందని, అందువల్లనే మండలంలో ఏడాదికేడాది కర్బూజ పంట పండిస్తున్న రైతులు అధికమవుతున్నారు.

నియోజకవర్గంలో జుక్కల్ మండలంలోని పడంపల్లి, నాగల్‌గావ్, దోస్పల్లి, జుక్కల్, డోన్‌గావ్, సోపూర్, బిజ్జల్‌వాడీ, కత్తల్‌వాడీ, చెండేగాం,

మాదాపూర్, హంగర్గ, పెద్దగుల్లా, చిన్నగుల్లా, కంఠాలి, గుండూర్, బస్వాపూర్, కౌలాస్, సావర్గావ్, వజ్రఖండి, పెద్దఎడ్గి, చిన్నఎడ్గి, లాడేగావ్, సుమారుగా మండలంలోని అన్ని గ్రామాలలో రైతులు కర్బుజా పంట పండిస్తున్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాటు పూర్తి

**నవతెలంగాణ-తాడ్వాయి**

మండల కేంద్రంలోని ప్రభుత్వ గురుకుల బాలికల పాఠశాలలో ఈనెల ఐదో తేదీ నుంచి జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపర్‌డెంట్ బి.సురేఖ ఆదివారం తెలిపారు. గురుకుల పాఠశాలకు చెందిన 136 మంది విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 161 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చీఫ్ సూపరింటెంట్ తెలిపారు.

## నూతన కమిటీ ఎన్నిక

**నవతెలంగాణ-రామారెడ్డి**

మండలంలోని గొల్లపల్లిలో కురుమ యువ చైతన్య నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు మామిడి సంజీవ్ ఆధ్వర్యంలో గ్రామ అధ్యక్షుడిగా కందూరి నరేష్, ఉపాధ్యక్షుడిగా జీర్ల మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కందురి సుమన్, ప్రధాన కార్యదర్శిగా రెడ్డి మల్లేష్, కోశాధికారిగా కందూరి మహేష్, ప్రచార కార్యదర్శుల జీర్ల నాగరాజును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కురుమ యువ చైతన్య సమితి వ్యవస్థాపక సభ్యులు గంగాధర్, జిల్లా నాయకులు ఎంకంపల్లి దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభించిన నాయకులు

**నవతెలంగాణ-జుక్కల్**

ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు ఆదే శాల మేరకు మండ లంలోని గుండూరు తాండలో సిసి రోడ్ పనులను ఆదివారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. పల్లెలలో సిసి రోడ్లు వేయడం పల్లె ప్రగతికి నాంది పలికినట్టేనని తెలిపారు. గ్రామాలలో వీధులలో రోడ్లు లేక అవస్థలు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే నిధులు కేటాయించి గ్రామంలో సిసి రోడ్డు వేసేందుకు అనుమతి ఇవ్వాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం నిధులు మంజూరు చేసి వెనువెంటనే సీసీ రోడ్డు పనులను ప్రారంభించడం సంతోషకరమైన విషయమని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుండూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మారుతి పటేల్, మాజీ ఉప సర్పంచ్ ప్రకాష్ పటేల్, గనుపటేల్, సంజు పటేల్, సురేష్ పటేల్, ప్రసాద్, రమేష్, సోపాన్, నారాయణ, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ పేషెంట్లకు ఆర్థిక సాయం

**నవతెలంగాణ-కామారెడ్డి**

జిల్లా కేంద్రంలో జరిగిన కామారెడ్డి ఆఫ్ మారథాన్ 21 కిలోమీటర్ల పరుగు పందెంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గెరిగంటి లక్ష్మీనారాయణ

45 వయసు కేటగిరీలో 5వ స్థానం సాధించారు. కాంపిటేషన్‌లో వచ్చిన ప్రైజ్‌మనీని రూ.5000 క్యాన్సర్ బారినపడ్డ చిన్న పిల్లలకు పద్మపణి సొసైటీ స్వచ్ఛంద సంస్థకు విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, పద్మ పానీసొసైటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్ స్వర్ణలత, విద్యాసంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇండ్లల్లో చోరీ

- మూడు లక్షల 20 వేల నగదు అపహరణ



చోరీ అయిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

**నవతెలంగాణ-తాడ్వాయి**

మండలంలోని బ్రాహ్మణపల్లితో పాటు మండల కేంద్రంలో శనివారం రాత్రి రెండు ఇండ్లలో తాళం వేసిన ఇంట్లో దొంగతనాలు జరిగాయి. బ్రాహ్మణపల్లిలో ఓ ఇంట్లో రూ.3లక్షలు, రెండు ఇండ్లలో ఐదు తులాల బంగారంతో పాటు 15 తులాల వెండి, ఓ ద్విచక్ర వాహనం అపహరణకు గురైంది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. గుర్తుతెలియని దొంగల వివరాలను తెలుసుకునేందుకు దర్యాప్తు ప్రారంభించారు. కేసులో భాగంగా క్లూస్ టీంతో వివరాలు సేకరించారు.

## ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదు

- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు కుశాల్

**నవతెలంగాణ-లింగంపేట్**

ప్రభుత్వ శాఖలో పనిచేసే ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదని పిఆర్టియు టీఎస్ జిల్లా అధ్యక్షులు కుశాల్ అన్నారు. ఆదివారం మండల సమీపంలోని లింగంపల్లి గ్రామ సమీపంలో గల డిపిఎల్ ఫంక్షన్ హాల్‌లో లింగంపేట్ మండల కేంద్రంలోని ఉచ్చతర పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూరయ్య ఉద్యోగ విరమణ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ.. పాఠశాలను దేవాలయంగా మార్చిన గొప్ప ఉపాధ్యాయుడని కొనియాడారు. విధి నిర్వహణలో పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఉపాధ్యాయ వృత్తికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. పలువురికి ఆదర్శంగా నిలిచారని ఆయనను అభినందించారు. శాలువా కప్పి పూలదండ వేసి ఘనంగా సన్మానించారు. ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దినత ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆయన సేవలు యూనియన్‌కు ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు నాయకులు,



ఉద్యోగిని సన్మానించిన పలువురు

మండల విద్యాధికారి షౌకత్ అలీ, పిఆర్టియు టీఎస్ మండలాధ్యక్షులు రవీందర్ శర్మ, శేషయ్య, దామోదర్, రాజయ్య, వేణుగోపాల్, శోభారాణి, మదన్మోహన్, అనిల్‌రెడ్డి, రజనీకాంత్, పరువయ్య, సాయన్న ఆయా మండలాలకు చెందిన పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంసీ చైర్మన్ నుంచి టీచర్‌గా అంకు సంధ్య



**నవతెలంగాణ-బోధన్**

బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంకు సంధ్యకు ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం వచ్చింది. దీంతో ఆమె ఏఎంసీ చైర్మెన్ నుంచి ఐదు రోజుల క్రితం తన చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేసి టీచర్ ఉద్యోగంలో చేరారు. గతంలో కోర్టులో పెండింగ్‌లో ఉన్న 2008 డీఎస్సీకి సంబంధించి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 140 మందిని ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియమించింది. ఇందులో ఏఎంసీ చైర్‌పర్సన్ అంకు సంధ్య ఒకరు. గత నెల 15న అంకు సంధ్యకు పోస్టింగ్ ఉత్తర్వులు వచ్చాయి. కామారెడ్డి జిల్లా డోంగ్లీ మండలం కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఆమెకు పోస్టింగ్ ఇచ్చారు. ఇటీవల పదవీకాలం ముగిసిన పాలకవర్గంలో కౌన్సిలర్‌గా ఐదేళ్లపాటు కొనసాగారు. అంతకముందు రెండు సార్లు ఆమె భర్త అంకు దామోదర్ (దాము) మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు.

## మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడికి పరామర్శ



పరామర్శించిస్తున్న మాజీ ప్రభుత్వ విప్

**నవతెలంగాణ-రామారెడ్డి**

ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షులు గర్గుల రాజగౌడ్ రోడ్డు ప్రమాదంలో కాలుకు గాయం కాగా ఆదివారం మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. జాగ్రత్తలు తీసుకుని త్వరగా కోలుకోవాలని ఆయనకు సూచించారు. గంప గోవర్ధన్ వెంట స్థానిక మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథరెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, తుపాకుల రాజేందర్‌గౌడ్, నల్లవెల్లి అశోక్, శ్రీనివాస్‌గౌడ్, జూకంటి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఐవీఎఫ్ రక్తదాన కార్యక్రమాలు అభినందనీయం

- ఐవిఎఫ్ ఢిల్లీ అధ్యక్షులు అశోక్ అగర్వాల్
- ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు

**నవతెలంగాణ-కామారెడ్డి**

ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషనల్ (ఐవిఎఫ్) కామారెడ్డి రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో సంవత్సరకాలంలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం 22 మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించి, 2306 యూనిట్ల రక్తాన్ని సేకరించిన ఈ ఘనతను సాధించిన మొట్టమొదటి సంస్థగా భారతదేశంలో నిలపడం అభినందనీయమని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐవిఎఫ్ ఢిల్లీ అధ్యక్షులు అశోక్ అగర్వాల్ అన్నారు. ఈ విజయానికి కారకులైన తెలంగాణ ఐవిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా, సేవాదళ్ చైర్మన్ డాక్టర్ బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్ హైమద్, ఉపాధ్యక్షులు గంప ప్రసాద్, ఎర్రం చంద్రశేఖర్‌ను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా అశోక్ అగర్వాల్ మాట్లాడుతూ.. దేశంలోనే ఇప్పటివరకు ఏ సంస్థ సాధించనటువంటి రికార్డును తలసేమియా చిన్నారుల కోసం రక్తాన్ని అందజేయడం ద్వారా ఇంటర్నేషనల్ వైశ్య




ఫెడరేషన్ తెలంగాణ, కామారెడ్డి రక్తదాతల సమూహం జరిగిందన్నారు. చిన్నారుల ప్రాణాలను కాపాడడం కోసం ఇప్పటివరకు 4500 యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించి తలసేమియా సికిల్ సెల్ సొసైటీ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలకు అందజేయడం సాధారణ విషయం కాదని తెలిపారు. సకాలంలో రక్తాన్ని అందజేస్తూ చిన్నారుల ప్రాణాలను కాపాడుతున్న రక్తదాతలకు సహకరిస్తున్న వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## మద్నూర్‌కు చేరుకున్న కోళ్యాణ్ పాక్ రేణుక ఛార్యపాదయాత్ర

**నవతెలంగాణ-మద్నూర్**

మహారాష్ట్ర దేగ్లూర్ నుంచి ప్రారంభమైన కోళ్యాణ్ పాక్ రేణుక ఛార్యపాద యాత్ర ఆదివారం మధ్యాహ్నం మద్నూర్‌కు చేరుకుంది. మద్నూర్‌లో పెద్ద ఎత్తున స్వాములకు పూజ కార్యక్రమం ఘనంగా చేశారు. అనంతరం సంగాయప్ప స్వామి పాదయాత్ర భక్తులకు, స్వాములకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. అనంతరం ఇక్కడి నుంచి బిచ్కుంద మండలంలోని కందర్‌పల్లికి పాదయాత్ర భక్తులు బయలుదేరారు. ఈ యాత్ర దాదాపు పది రోజులపాటు జరుగుతుందని, దెగ్లూరు నుంచి ప్రారంభమైన స్వాముల పాదయాత్ర గాంధార్ మండలానికి చేరుకుంటుందని వివరించారు.

## ఆర్యవైశ్య అభివృద్ధి సంఘం జిల్లా అధ్యక్షులుగా సిద్ధంశెట్టి రమణ

**నవతెలంగాణ-కామారెడ్డి**

ఆర్యవైశ్య అభివృద్ధి సంఘం జిల్లా అధ్యక్షులుగా సిద్ధంశెట్టి రమణను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని గాంధీనగర్‌లో గల ఆర్యవైశ్య అభివృద్ధి సంఘంలో ఎన్నికల అధికారులు మోటూరి పురుషోత్తం, చాట్ల లింగం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య అభివృద్ధి సంఘం ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షులుగా సిద్ధంశెట్టి రమణ, ప్రధాన కార్యదర్శిగా నంగులూరి వెంకటేశం, కోశాధికారిగా శిల వెంకట రాజయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమను రెండు సంవత్సరాలుగా ఆర్యవైశ్య అభివృద్ధి సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శి, కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ఆర్యవైశ్య అభివృద్ధి సంఘం సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. నిరుపేద ఆర్యవైశ్య సంఘం కుటుంబ సభ్యులకు తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు సునీల్ కుబ్బ, వెంకట రాజం, తృప్తి అనిల్, కాముని సందీప్, కస్పా శ్రీనివాస్, పప్పుల సోమశేఖర్, ఆర్యవైశ్య అభివృద్ధి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా బోధించాలి

- ఎంఈఓ నాగయ్య




మాట్లాడుతున్న ఎంఈఓ నాగయ్య

**నవతెలంగాణ-బోధన్**

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా ఇందూర్ హైస్కూల్‌లో విద్యాబోధన చేయడం గర్వకారణమని ఎంఈఓ నాగయ్య అన్నారు. శనివారం పట్టణంలో గల ఆచన్‌పల్లిలోని ఇందూర్ హైస్కూల్ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా విద్యాబోధన జరగాలని సూచించారు. ఇందూర్ హైస్కూల్ విద్యార్థులు నాణ్యమైన విద్యను పొంది దేశవిదేశాలలో స్థిరపడడం అభినందనీయమన్నారు. ఇందూర్ విద్యాసంస్థల అధినేత కొడాలి కిశోర్ ఇతింతై వటుడింతై అన్న చందంగా ఎదిగారని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులకు, ప్రేక్షకులకు అలరించాయి. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకులు బసవేశ్వర రావు, ట్రస్మా నాయకులు మిద్దెలా రాజు, శ్రీనివాసరావు, హరికృష్ణ, సురేష్, రమణారెడ్డి, హెచ్ఎం రామారావు, స్వాతి, ధనలక్ష్మి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## కబ్జాకు గురవుతున్న పంచాయతీ స్థలం

**నవతెలంగాణ-కామారెడ్డి**

మాచారెడ్డి మండలంలోని గాజ్యు నాయక్ తండా అంగడి బజార్‌లోని గ్రామపంచాయతీ స్థలం రోజురోజుకూ కబ్జాకు గురవుతుందని మాజీ ఉప సర్పంచ్ తోకల కిషన్ తెలిపారు. అంగడి బజార్లో పర్మిషన్ వరకు ఇల్లు కట్టుకున్నారని, కానీ ఇంటి ముందు రోడ్డు వరకు రేకుల షెడ్డు వేసుకొని కబ్జా చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గ్రామ కార్యదర్శికి, గ్రామ ప్రత్యేక అధికారికి తెలిపినా పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రేకుల షెడ్లు తీసేయని యెడల ప్రజావాణిలో ఫిర్యాదు చేయనున్నట్టు పేర్కొన్నారు.



ఇంటి ముందు రెకుల షెడ్డు నిర్మాణం

## బాధిత కుటుంబానికి పరామర్శ

**నవతెలంగాణ-ఎల్లారెడ్డి (లింగంపేట్)**

ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల గ్రామానికి చెందినా బెగరి లక్ష్మీ శుక్రవారం ప్రమాదవశాత్తు హైదరాబాద్‌లో చనిపోయింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు వెల్లుట్ల సంతోష్ కుమార్ ఆదివారం బెగరి లక్ష్మీ కుటుంబాన్ని పరామర్శించారు. మనోధైర్యం కల్పించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒట్లం భూమయ్య, నర్వ శంకర్, ప్రకాష్, దేవరాజ్, మసానిపేట్ చిన్న సాయిలు, మెంబర్ కాశీరాం, గౌతమ్, విట్టల్, రమేష్, శేఖర్, రమేష్, పోతురాజు సాయిలు, కొల్పుల కాశీరాం, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ కుటుంబానికి ఆర్థిక సాయం

**నవతెలంగాణ-లింగంపేట్**

డీఎస్సీ 2024 గణిత విభాగంలో జిల్లా టాపర్‌గా నిలిచి జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల లింగం పేట్‌లో జాయిన్ అయి వారంలోనే మరణించిన వైపీ గిరి కుటుంబ సభ్యులకు ఆదివారం ఆర్థిక సాయం అందజేశా రు. ఆయన కుటుంబాన్ని ఓదార్చారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జూకంటి బాపురెడ్డి తన వంతు సహాయంగా రూ.5000 అందజేశారు. అనివార్య కారణాలవల్ల సిపిఎస్ ఉద్యోగులు చనిపోయినట్లయితే తన వంతు సహాయంగా తాను సర్వీసులో ఉన్నంత కాలం రూ.5000 అందిస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఉన్నారు.

## విరగబూసిన మోదుగ పువ్వు



**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

అటవీ ప్రాంతంలో ఎక్కడ చూసిన మోదుగ పువ్వు విరగబూసింది. అటుగా వెళ్తున్న వారు, ప్రయాణికులు మోదుగ పూలను ఆసక్తిగా తిలకిస్తున్నారు. మోదుగ పువ్వును హెూలీ రంగులకు ఉపయోగిస్తారు. సైన్స్ ప్రకారం ఈ రంగు నీళ్లు చర్మ రోగాలను నివారణ చేసేదని తెలిపారు.

## పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి

**నవతెలంగాణ-ఆర్మూర్**

ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ అధికారులు కోరారు. ఆదివారం పట్టణంలోని మామిడిపల్లిలో ప్రాపర్టీ టాక్స్ వసూలు చేసినట్లు తెలిపారు. పట్టణ ప్రజలు సకాలంలో టాక్స్ చెల్లించాలని, అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు శేఖర్, దత్తారెడ్డి, వెంకటేష్, నాగరాజు, నర్సయ్య, భాను, శ్రీకాంత్, సింధుజ, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఆస్తిపన్నులు వసూలు చేస్తున్న అధికారులు

## వర్సిటీ మైనార్టీ సెల్ డైరెక్టర్‌గా డాక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖవి నియామకం

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

తెలంగాణ యూనివర్సిటీ మైనార్టీ సెల్ డైరెక్టర్ గా డాక్టర్. మహ్మద్ అహ్మద్ ఖవిని నియమిస్తూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి యాదగిరి రావు ఆదేశాల మేరకు నియామకపు ఉత్తర్వులను యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి అందజేశారు. డాక్టర్. మహ్మద్ అబ్దుల్ ఖవి దశాబ్ద కాలంగా ఉర్దూ డిపార్ట్మెంట్లో సేవలు అందిస్తున్నారు. డాక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖవి గతంలో ఉర్దూ డిపార్ట్మెంట్ హెడ్‌గా, బిఓఎస్ చైర్మన్‌గా, పి. ఆర్ ఓ.( డైరెక్టర్) గా, చీఫ్ వార్డెన్‌గా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డైరెక్టర్‌గా, ఎగ్జామ్ బ్రాంచ్ అడిషనల్ కంట్రోల్ గా, యూత్ వెల్ఫేర్ ఆఫీసర్, ఈక్వల్ ఆపరేటివ్ సెల్ చైర్మన్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖవి మాట్లాడుతూ నా మీద నమ్మకంతో నియామకపు ఉత్తర్వులు అందించిన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టీ.యాదగిరిరావుకు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు.



నియామకపత్రం అందజేస్తున్న వీసీ

## జెస్సు అనిల్‌కుమార్‌కు సన్మానం



జెస్సు అనిల్‌ఖుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

**నవతెలంగాణ-ఆర్మూర్**

సోమ వంశీయ సహస్రార్జున క్షత్రియ (పట్కరి/ఖత్రి) సమాజ్ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ మెంబర్ గా నియామకమైన జెస్సు అనిల్ కుమార్‌ను ఆదివారం బిజెపి నాయకులు సన్మానించారు. కార్యక్రమం లో బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి పులి యుగంధర్, పట్టణ ఉపాధ్యక్షులు దోండి ప్రకాష్, పట్టణ కార్యదర్శి మిరియాల్కర్ కిరణ్, బీజేవైఎం పట్టణ, మండల అధ్యక్షులు కలిగోట ప్రశాంత్, నరేష్ చారి, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి ఉదయ గౌడ్, ఓబిసి మోర్చా పట్టణ అధ్యక్షులు బాశెట్టి రాజ్ కుమార్, కార్యదర్శి బట్టు రాము, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపాదరావుకు ఘన నివాళి



నివాళ్లు అర్పిస్తున్న అధికారులు

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

శాసన సభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన జయంతి వేడుకలకు అదనపు కలెక్టర్ అంకిత్ విచ్చేసి, శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసన సభ స్పీకర్‌గా శ్రీపాదరావు అందించిన సేవలను స్మరిస్తూ, శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జె.ముత్తెన్న, ఎన్.ఐ.సీ అధికారి మధు, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వరదబట్టు వేణురాజ్



**నవతెలంగాణ-కంఠేశ్వర్**

ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వరదబట్టు వేణురాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర కమిటీలో చోటు కల్పించడంపై రాష్ట్ర ఇన్చార్జీలు మహమ్మద్ ఫహద్, ప్రతీక్ సింగ్, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ఎస్‌యూఐ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని వేణురాజ్ పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన అన్నివిధాల సహకరించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

## యథావిధిగా ప్రజావాణి

### కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని నేటి నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాసన మండలి ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.ప్రస్తుతం పోలింగ్ ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం తిరిగి యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

## ట్రాక్టర్ కేజీవీల్, గొర్రు చోరీ

**నవతెలంగాణ-భీంగల్ రూరల్**

భీంగల్ పట్టణ కేంద్రానికి చెందిన సుంకరి సురేష్ అనే రైతు ట్రాక్టర్‌కు సంబంధించిన కేజీవీల్, గొర్రులను శనివారం అర్ధరాత్రి పొలం వద్ద నుంచి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని రైతు తెలిపారు. పంటలు వేసుకునే సమయంలో దొంగలించడం వల్ల పంటలు వేయడం మానుకోవాల్సి వస్తుందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపారు.

# కాసులు కురిపిస్తున్న ఇసుక

- ముఖ్యమంత్రి ఆదేశాలు బేఖాతర్
- అనుమతుల ముసుగులో వ్యాపారం
- అడ్డాలు మారుస్తూ ఇసుక తరలింపు

**మామూళ్ల మత్తు పోలీసులకు కొరడా...**

జిల్లాలోని జక్రాన్ పల్లి, ఇందల్వాయి, ధర్పల్లి, సిరికొండ, పోతంగల్, రుద్రూర్ , వర్ని, బోధన్ ,సాలూర, రెంజల్, భీంగల్, మాక్లూర్ మండలాలలో ఇసుక దందా ఎక్కువగా సాగుతుండగా ఇక్కడ పనిచేసిన ఎస్సైల, సీఐల కనుసన్నల్లో రాత్రి వేళల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు డిఐజి జారీ చేసిన ఉత్తర్వులు గత కొన్ని నెలల కింద తీవ్ర కలవరం రేపాయి. మంజీరా నది, పెద్దవాగు, ఇతర వాగులు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో ఇసుకాసురులు రెచ్చిపోయారు. రాత్రివేళ ఇసుక ట్రాక్టర్లు టిప్పర్లలో నింపి నిజామాబాద్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలిస్తుండగా ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్, కోట ఆర్మూర్ మామిడిపల్లి చౌరస్తాల్లో ఇసుక డంపులు దర్శనమిస్తున్నాయి.

**వాటాలు వేసుకుంటూ...**

ఇసుక వ్యాపారులతో పోలీసులు ప్రతినెల మామూలు తీసుకుంటూ ఆయా ప్రాంతాన్ని బట్టి నెలకు ఒక ట్రాక్టర్‌కు ఇంత అని తీసుకుంటున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్కు 10,000 నుంచి 20వేల వరకు ఇచ్చేలా ఎస్సైలు, సీఐలతో ఒప్పందాలు చేసుకున్నారు. దీంతో ఒక్కో అధికారికి నెలకు 50 వేల నుండి 5 లక్షల వరకు వాటాలు వెళ్తుండగా , దందాను ఉధృతం చేస్తూ లక్షలలో కూడబెడుతున్నారు. ఇక్కడకు తనకు అనుకూలంగా ఉండే పోలీసులు వచ్చేలా రాజకీయ నాయకులతో సైతం మాట్లాడుతున్నట్లు



పట్టణంలోని ఓ వార్డులో నిల్వ చేసిన ఇసుక డంపులు

**ఎన్ని ప్రభుత్వాలు మారిన అక్రమ వ్యాపారస్తుల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఒకవైపు ప్రభుత్వం ఎన్నో నిబంధనల మధ్య ఇసుక అనుమతులు ఇస్తున్న, అక్రమ ముసుగులో ఇసుక వ్యాపారులు చేస్తున్న వారి ఆటలు సాఫీగా సాగుతున్నాయి. అనతి కాలంలోనే అడ్డగోలుగా సంపాదించి పెట్టే ఇసుక అక్రమ రవాణా పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా.. ఆదేశాలు బేఖాతర్ చేస్తున్నారు. రోజుకు లక్షల్లో సంపాదన వస్తుండడంతో అక్రమ ఇసుక వ్యాపారం చేస్తూ సంవత్సరంలోనే కోట్లల్లో కూడబెట్టుకోవచ్చు అని ఇసుక వ్యాపారుల దందా... మూడు పువ్వులు, ఆరుకాయలుగా విస్తరింప చేసుకుంటున్నారు.**

నవతెలంగాణ-ఆర్మూర్

సమాచారం. మరికొన్ని చోట్ల ఇసుక దందాలలో రాజకీయ నాయకుల ప్రమేయం కూడా ఉంది. గత సంవత్సరం సెప్టెంబర్న 4 ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్న ఎస్ఐల, సిఐల జాబితాను డిఐజి ఆఫీసుకు పంపి బదిలీలు నిర్వహించి కొందరిని నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు సైతం బదిలీ చేశారు.

**జిల్లాలో..**

బాల్కొండ నియోజకవర్గంలో పెద్ద వాగు నుంచి ఇసుక తరలింపు దందా నడుస్తుంది. వేల్పూర్, మోర్తాడ్, భీంగల్ మండలాలలోని వెంకటాపూర్, పాలెం, ధర్మోర, గాండ్లపేట, బెజ్జోర, గోన్ గొప్పుల, బడా భీంగల్, సుంకెట్ తదితర ప్రాంతాల గుండా వెళ్లే కప్పల వాగు, పెద్దవాగుల నుంచి ఇసుక రవాణా జరిగేది. ప్రస్తుతం అడ్డాలు మారుస్తూ ఏర్గట్ల మండలంలోని భట్టాపూర్ నుంచి ఇసుక రవాణాకు తెరలేపినట్టు విశ్వసనీయ సమాచారం. భట్టాపూర్ పెద్దవాగు నుంచి భారీ ఎత్తున ఇసుక తరలింపు చేస్తున్నారు. 34 ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు తీసుకొని ఒకే ఒక్క రోజు మూడు ట్రాక్టర్ల ఇసుక తరలిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు.. ఎల్కటూరు గ్రామ కమిటీ అడ్డు చెప్పడంతో రెండు మూడు రోజులు ఆగి మళ్ళీ అక్రమ తరలింపు మొదలైంది.

**సామాన్యుడికి భారంగా ఇసుక....**

ఇంటి నిర్మాణం చేపట్టిన సామాన్య ప్రజలకు ఇసుక రవాణా భారంగా మారింది. అధిక ధర చెల్లించి దళారుల నుంచి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇది అక్రమ ఇసుక వ్యాపారులకు కలిసి వచ్చినట్లు అయింది. ఇసుక డంపులను. టిప్పర్లను రాజకీయ నేతల ఒత్తిళ్లతో తూతూ మంత్రంగా నామమాత్రపు జరిమానాలు విధించడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తుంది..

**విజిలెన్స్ నివేదికపై ఉత్కంఠ...**

బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్, వేల్పూర్ మండలాల్లో పెద్దవాగు నుంచి ఇసుక తవ్వకాలలో అక్రమాలు చోటు చేసుకున్నాయని వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ శాఖ రహస్యంగా విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదికను అందజేసింది. కొందరు ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, పోలీస్ అధికారులకు వాటా ఉందని కోణంలో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. లక్కోరా కేంద్రంగా పగటిపూట ఇసుకను డంపింగ్ చేసి పెద్దపెద్ద వాహనాలలో రాత్రిపూట అక్రమంగా తరలిస్తున్నారని, ఇందులో రాజకీయ నాయకుని పాత్ర ఉందని, విజిలెన్స్ అధికారులు తమ నివేదికలో వెల్లడించినట్లు తెలిసింది. విజిలెన్స్ అధికారులు ఇసుక అక్రమాలపై నివేదికను సిద్ధం చేసి పంపగా ప్రభుత్వ యంత్రాంగం స్పందన పై ఉత్కంట నెలకొనగా, ఎలాంటి చర్యలు తీసుకుంటారో తెలియాల్సి ఉంది.

# కూచిపూడిలో రాణిస్తున్న ప్రపూర్ణ

- రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్న క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి

**నవతెలంగాణ-ఆర్మూర్**

పట్టణంలోని క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి తిరునగరి ప్రపూర్ణ చదువుతోపాటు కూచిపూడి నృత్యంలో అత్యంత ప్రతిభ కనబరుస్తోంది. జిల్లా కేంద్రంలోని అందెల రవళి నాట్యాలయంలో కూచిపూడి నృత్యాన్ని అభ్యాసం చేస్తూ రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో విజేతగా నిలిచారు. హైదరాబాద్, యాదగిరి గుట్ట, నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, కరీంనగర్ మొదలగు జిల్లాలో రాష్ట్రాల్లో వివిధ స్థలాల్లో నృత్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. తల్లిదండ్రులు రవి రతన్ ప్రసాద్ సంజన మద్దతుతో, అత్త గిరిజ గాయత్రి ప్రోత్సాహంతో, గురువు బొడ్డపాటి సాయి రవళి వద్ద శిక్షణ పొందుతూ పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో కూచిపూడి నృత్యం పరీక్షల్లో కూడా పాల్గొన్నారు. నాట్యోపాసన అనే కార్యక్రమంలో చెన్నైలోఉన్న తన గురువు వెంపటి ప్రియాంక ద్వారా సర్టిఫికెట్ పొంది పేరు తెచ్చుకున్నారు,. వినాయక చవితి, దసరా నవరాత్రుల సందర్భంగా నృత్య ప్రదర్శన చేసి జిల్లా అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్య నారాయణ ద్వారా పురస్కారం అందుకున్నారు,. తన చిన్న వయసులోనే బాన్సువాడలో నృత్య ప్రదర్శన చేసి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని కూడా ఆశ్చర్యపరిచారు .



పురస్కారం అందుకుంటున్న ప్రపూర్ణ



ఈనెల 21న వెంకటేశ్వర రథోత్సవంలో నృత్యం చేసి రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి చేతుల మీదగా కూడా చిన్నారి పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాట్యంలో రాణించడానికి గురువుతోపాటు తల్లిదండ్రులలు మాత్రమే కాకుండా తనకి మొదటి మెట్టు ప్రారంభించిన తాతాయ్య సుదర్శన స్వామి కారణం అని తెలిపారు. కుటుంబంలో అందరూ తోడుగా ఉండి చెయ్యిపట్టుకొని నడిపిస్తున్నారని అన్నారు. ప్రదర్శనలు చూసి క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ , సెక్రెటరీ అల్జాపూర్ దేవేందర్, ప్రిన్సిపాల్ ఆర్.కె. పాండే అభినందిస్తూ ప్రత్యేకమైన ప్రతిభ ఉండటం గర్వకారణంగా ఉందని అన్నారని తెలిపారు. జక్రాన్ పల్లి మండలంలోని అర్గుల్ గ్రామానికి చెందిన ప్రపూర్ణ 4వ తరగతి నుంచే నృత్యాన్ని అభ్యాసం చేస్తూ శ్రీ రామ కృష్ణవిద్యానికేతన్ పాఠశాలలో 10వ తరగతిలో 10 జిపిఏ సాధించింది. ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ (ఈసీఈ) డిపార్ట్మెంట్లో విద్యాభ్యాసం చేస్తూనే కూచిపూడి నృత్యాన్ని కూడా అభ్యాసం చేస్తున్న. పరీక్షల సమయంలో సహాయపడతారు. అందువల్లనే నా కఠిన సాధనకి ఫలితం సాధించినట్టు, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను చేరాలని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఈ పురస్కారం కూచిపూడి నాట్యంలో విద్యార్థుల ప్రతిభను చాటడమే కాకుండా, ఇంజనీరింగ్ విద్యార్థుల్లో కళా సాంస్కృతిక అభిరుచిని పెంపొందించేలా ప్రోత్సహిస్తోంది.

## గల్ఫ్ బాధిత కుటుంబాలను ఆదుకోవడం అభినందనీయం

- మండలాధ్యక్షుడు బండ సురేందర్ రెడ్డి

**నవతెలంగాణ-రామారెడ్డి**

గల్ఫ్‌లో మరణించిన 113 కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడం అభినందనీయమని జిడబ్ల్యూఏసి రామారెడ్డి మండల అధ్యక్షులు బండ సురేందర్ రెడ్డి ఆదివారం తెలిపారు. గల్ఫ్‌లో తప్పిపోయిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వానికి సూచన చేశారు.

## ఘనంగా నల్ల పోచమ్మ బోనాలు



**నవతెలంగాణ-మోపాల్**

గ్రామ అభివృద్ధి కమిటీ ఘనంగా నల్ల పోచమ్మ బోనాలు మంచిప్ప గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు బోనాలు ఆదివారం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముందుగా గ్రామ నడిబొడ్డున గ్రామదేవతలైన సార్గమ్మల వద్ద బోనాలను పూజించుకొని గ్రామ పరిసర ప్రాంతంలో గల నల్ల పోచమ్మ మందిరం వద్దకు బోనాలతో డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వెంకట్రాం నాయక్, గుండుల శ్రీనివాస్, అశోక్, జగదీష్ యాదవ్, మోహన్ రెడ్డి, సాయి రెడ్డి సాయిలు, నర్సారెడ్డి, ప్రవీణ్, సాయిరాం, రాజేష్, శ్రీనివాస్, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆరేళ్లుగా నిరుపయోగంగా సబ్ జైలు భవనం

- రిమాండ్ ఖైదీలను జిల్లా కేంద్రానికి తరలింపు
- తప్పని ఇబ్బందులు
- పునరుద్ధరించాలంటున్న అధికారులు

**నవతెలంగాణ-ఆర్మూర్**

రోజు రోజుకి పెరుగుతున్న వ్యయభారంతో గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐదు సబ్ జైళ్లను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు 2018 డిసెంబర్లో ఉత్తర్వులు జారీ అయ్యాయి. వరంగల్ జిల్లాలోని నర్సంపేట, పరకాల, ఖమ్మం జిల్లాలోని మధిర సబ్ జైళ్లను మూసివేస్తూ జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జీవో నెంబర్ 6158ను విడుదల చేశారు. సమైక్య పాలకుల హయాంలోనే ఆర్మూర్ సబ్ జైలును మూసివేస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డప్పటికీ స్థానికులు, న్యాయవాదుల విజ్ఞప్తి మేరకు ఆదేశాలను తాత్కాలికంగా నిలిపివేశారు. జైల్లో ఉండే ఖైదీల కంటే అధికారులు, సిబ్బంది సంఖ్యనే ఎక్కువగా ఉండడం, దీనికి తోడు నిర్వహణ భారం తడిసి మోపెడు కావడంతో సబ్ జైళ్లను ఎత్తివేయాలని జైలు శాఖ నిర్ణయం తీసుకుంది. సూపరింటెంట్లు, జైలర్లు, వార్డర్లు, సిబ్బంది తప్పనిసరిగా ఉండాల్సి ఉంటుంది. వంటచేసే మనుషులు ఇతర పనుల కోసం సిబ్బందిని పెట్టుకోవాల్సన పరిస్థితి. కరెంటు బిల్లు నుంచి ఇతర అవసరాల కోసం వేలల్లో ఖర్చులు అవుతాయి. సిబ్బంది జీతాలతో కలిపి నెలకు 6 లక్షల వరకు చేరేది.

**10 దాటని సంఖ్యతో...**

సబ్ జైల్ అంటేనే కేవలం పరిమిత ఖైదీలను బందీగా ఉంచుతారు .నామమాత్రమైన లాకప్ సౌకర్యాలు గదులు మాత్రమే ఉంటాయి. ఒక విధంగా చిన్నచిన్న కేసుల్లో అతికొద్ది రోజుల కోసం రిమాండ్ ఖైదీగా వెళ్లే వారిని ఈ సబ్ జైలుకు తరలిస్తారు. ఒకవేళ శిక్షలు పడిన తీవ్రమైన నేరాల్లో భాగస్వాములు అయిన, కరుడుగట్టిన నేరస్తులు తీవ్రవాదులు ఉన్న జిల్లా జైలు లేక సెంట్రల్ జైలుకు పంపుతారు.

**నిరుపయోగంగా జైలు భవనం....**

గత ఆరు సంవత్సరాల నుండి జైలు భవనం నిరుపయోగంగా మారింది. దీంతో పలు కేసుల్లో పోలీస్, ఎక్సైజ్ ,అటవీశాఖ అధికారులు సిబ్బంది రిమాండ్ ఖైదీలను జిల్లా కేంద్రానికి తరలించే విషయంలో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ కోర్టుకు తరలించిన రిమాండ్ ఖైదీలను జిల్లా కేంద్రంలోని




జైలుకు తరలించడంలో కోర్టు పరిధిలోని ఉన్న మండలాల పోలీసులు ఈ సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. కాగా జైలు ఉపయోగంలో ఉన్న సమయంలో కోర్టు కానిస్టేబుల్ మాత్రమే రిమాండ్ ఖైదీలను జైలుకు తీసుకువెళ్లడానికి అవకాశం ఉండేది. ప్రస్తుతం ఈ ఖైదీలను జిల్లా కేంద్రానికి తరలించాల్సి ఉండడంతో ఎస్కార్ట్ పోలీసుల సహాయం తప్పనిసరి పరిస్థితిగా మారింది.

**డివిజన్ పరిధిలోని...**

డివిజన్ పరిధిలోని నందిపేట్, జక్రాన్‌పల్లి, బాల్కొండ, మెండోర, ముక్కాల్, వేల్పూర్, మోర్తాడ్, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్, సిరికొండ మండలాల పోలీస్ స్టేషన్లో పరిధిలోని కేసులను ఇక్కడ విచారిస్తారు. భీంగల్, మోర్తాడ్, ఆర్మూర్ ఎక్సైజ్ కార్యాలయానికి చెందిన కేసులతో పాటు, ఆర్మూర్ , కమ్మర్‌పల్లి అటవీశాఖ రేంజ్‌కు చెందిన కేసులను సైతం విచారిస్తారు. విచారణలో భాగంగా నిందితులుగా ఉన్న రిమాండ్ ఖైదీలను పట్టణంలో ఉన్న సబ్ కోర్టులో బంధించేవారు. శిక్షలు ఖరారైన అనంతరం జిల్లా జైలుకు తరలించేవారు. కాగా ఖైదీలను కోర్టుకు తరలించే బాధ్యత నిర్వహించే పోలీసులపై మరింత పని భారం పెరిగింది. సమస్యను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం సబ్ జైలు ను పునరుద్ధరించాలని సంబంధిత శాఖల అధికారులు కోరుతున్నారు.